

వైద్యపరికరాల కొనుగోలు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అవసరమైన రూ.కోటి విలువైన వైద్య పరికరాలను శుక్రవారం అధికారులు టెండర్ ప్రక్రియ ద్వారా కొనుగోలు చేశారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా జాయింట్ కలెక్టర్, డిస్ట్రిక్ట్ పర్చేజ్ కమిటీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ఆసుపత్రికి కావాల్సిన పలు వైద్యపరికరాల కొనుగోలుకు టెండర్లు నిర్వహించారు. డెక్సా స్కాన్, మూడు అనెస్తీషియా వర్క్ స్టేషన్లు, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలకు రెండు అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్లు, 20 ఏసీల కొనుగోలుకు సంబంధించి టెండర్ బాక్స్‌ను కమిటీ ఆధ్వర్యంలో తెరిచారు. వీటిని కొనేందుకు ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ నిధులను వెచ్చించనున్నారు. కమిటీ చైర్‌పర్సన్ జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, సివిల్ సప్లయీస్ డిస్ట్రిక్ట్ మేనేజర్ షర్మిల, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నర్సమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ పాల్గొన్నారు.


టెండర్లు నిర్వహిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

పాఠశాల నిర్వహణపై స్పష్టత ఇవ్వండి

కర్నూలు సిటీ: సాధారణ ఎన్నికల శిక్షణ, పదవ తరగతి మూల్యాంకనం ఒకే రోజు ఉండడంతో పాఠశాలల నిర్వహణకు ఇబ్బందులు వస్తాయని, స్కూల్ నిర్వహణపై స్పష్టత ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, రామకృష్ణ గురువారం డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్‌కు వినతి పత్రం ఇచ్చారు.

యథావిధిగా తాగునీటి సరఫరా

కర్నూలు (టౌన్): రెండు రోజులుగా నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని 250 ఎంఎం పైపులైన్‌కు చేపట్టిన మరమ్మత్తులు విజయవంతంగా పూర్తయ్యాయని నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, చంద్రశేఖర్ నగర్, మారుతీ నగర్, బృందావన్ నగర్, సరస్వతీ నగర్, జయ రాం నగర్, ధనలక్ష్మీ నగర్, వాసవీ నగర్, బీటీఆర్ నగర్, మాధవీ నగర్, కమల నగర్, శ్రీలక్ష్మీ నగర్, శ్రీనగర్ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ(వార్డునెంబర్లు 19,20,21)లకు యథా విధిగా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

గతేడాది మూల్యాంకన బకాయిలు చెల్లించాలి

కర్నూలు సిటీ: గతేడాది పదవ తరగతి మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రామశేషయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు.



